క్లుప్తంగా

ఆధునిక జీవన శైలితోనే ఊబకాయం



వృద్ధురాలిని పరీక్షిస్తున్న ఫిజియోథెరపిస్టు వెంకటరమణ

కాకినాడ రూరల్: పిల్లల్లో ఆధునిక జీవన శైలి కారణంగానే ఊబకాయం పెరుగుతుందని, దీనివల్ల పలు అనారోగ్య సమస్యలు వస్తాయని ఫిజియోథెరపిస్టు కె.వెంకటరమణ అన్నారు. ఊబకాయ నివారణ దినోత్సవం సందర్భంగా అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక రమణయ్యపేటలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ, నేటి బాలలు అధిక కేలరీలున్న జంక్ ఫుడ్ ఎక్కువగా తీసుకోవడంతో ఊబకాయం బారిన పడుతున్నారని వివరించారు.ఆటలు, శారీరక శ్రమను పిల్లలకు అలవాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, రాజా తదితరులు పాల్గొన్నారు.

హిందీ భాషపై పట్టు సాధించాలి



కార్యక్రమంలో పాల్గొన్న యూనియన్ బ్యాంకు అధికారులు, సిబ్బంది

బాలాజీచెరువు: ప్రతి ఒక్కరూ హిందీ భాషపై పట్టు సాధించాలని యూనియన్ బ్యాంక్ హెడ్ కాకి సాయి మనోహర్ అన్నారు. స్థానిక ఎస్‌వీఎన్ గ్రాండ్‌లో శుక్రవారం హిందీ రాజ భాష దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ, దేశంలో ఉన్న అన్ని ప్రాంతాలలో హిందీ భాషను వాడుతున్నారన్నారు. ఉద్యోగులు అందరూ విధిగా ఈ భాషపై పట్టు సాధించాలని సూచించారు. జాతీయ ఉద్యమంలో అఖిల భారతాన్ని జాగృతం చేసి, ఏకతాటిపై నడిపేందుకు హిందీభాష అనాడు దోహదపడిందన్నారు. ఈ నేపథ్యంలో గాంధీజీ స్ఫూర్తితో 1949 సెప్టెంబర్ 14న రాజ్యాంగంలో 351వ అధికరణం 8వ షెడ్యూల్‌లో హిందీని జాతీయ భాషగా పొందుపరిచారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బ్రాంచ్ మేనేజర్లు, ఇన్సూరెన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం



బాలికలకు ఉచితంగా పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బాలికలకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ విశ్రాంత జనరల్ మేనేజర్ ఇందుగుల ప్రసాద్‌నాయుడు మాట్లాడుతూ, బాలికల హక్కులకు రక్షణ అవసరమన్నారు. సమాజ ప్రగతికి పునాది బాలికలన్నారు. కుమారులతో సమానంగా కుమార్తెలను పెంచే వ్యక్తిత్వం రావాలన్నారు. సరైన స్ఫూర్తితో, భవిష్యత్తుపై సానుకూల దృక్పథంతో ఎదగడానికి వాతావరణం కల్పించాలని సూచించారు. బాల్య వివాహాలు తగవన్నారు. భ్రూణ హత్యలను నివారించాలని, బాలికా విద్యను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, కుమార్ యాదవ్, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

గజ్జె పూజ మహోత్సవం

కాకినాడ సిటీ: తూరంగి రవీంద్రనగర్‌లోని శివ సాయి లక్ష్మి నృత్య నికేతన్ నాట్యాచారిణి పారుపల్లి సాయి నిహారిక ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యం నేర్చుకుంటున్న చిన్నారులకు గజ్జె పూజ ఉత్సవం శుక్రవారం నిర్వహించారు. సాంస్కృతిక నృత్యమైన కూచిపూడి నేర్చుకోవడం వల్ల భౌతిక, మానసిక ఆనందం పొందవచ్చని, క్రియాశీలత ఉండేందుకు ఉపయోగపడుతుందని సాయి నిహారిక వివరించారు. దసరా సందర్భంగా నాట్యం నేర్చుకుంటున్న పిల్లలకు గజ్జె పూజ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. దీనివల్ల పిల్లలకు సాంస్కృతిక కార్యక్రమాలపై ఆసక్తి పెంచేందుకు ఆస్కారం ఉంటుందన్నారు.

రతన్ టాటాకు చిత్రాంజలి



వెంకటేష్ గీసిన రతన్ టాటా చిత్రం

కాకినాడ రూరల్: పారిశ్రామిక దిగ్గజం, దాతృత్వానికి మారుపేరుగా నిలిచిన రతన్ టాటాకు చిత్రలేఖనం ద్వారా శ్రద్ధాంజలి ఘటించారు. ఏపీఐఐసీ జోనల్ కార్యాలయంలోని అటెండర్ రామకుర్తి వెంకటేష్ ఈ చిత్రాన్ని రూపొందించి నివాళులర్పించారు.

ధసరా భారం



కూరగాయలు, నిత్యావసరాలపై దసరా ప్రభావం పడింది. నిత్యం పెరుగుతున్న ధరలతో సామాన్య, ప్రజలు బెంబేలెత్తుతుండగా, దసరా పండగ ప్రభావం మరింతగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఇటు పట్టణ, అటు గ్రామీణ ప్రాంతాల్లో దసరా సందడి అంతగా లేకుండా పోయింది.

- పండగ పూట కూరగాయల రేట్లతో బెంబేలు
- అమాంతం పెరిగిన నిత్యావసరాల ధరలు
- సామాన్య, మధ్య తరగతి ప్రజల గగ్గోలు

కాకినాడ సిటీ: దసరా ఉత్సవాలకు వివిధ ప్రాంతాల్లో ఉన్న అల్లుళ్లు, కుమార్తెలు, బంధువులు పెద్దఎత్తున చుట్టాల ఇళ్లకు తరలివచ్చారు. ఈ క్రమంలో పిల్లలకు తినుబండరాలు చేసి పెడదామని ఆశపడ్డ మధ్య తరగతి ఇళ్లలో మహిళలు.. పెరిగిన నిత్యావసరాల ధరలను చూసి జంకుతున్నారు. నెల రోజుల క్రితం ప్రజలకు అందుబాటులో ఉన్న పప్పులు, నూనెలు, కూరగాయలు, దసరా పండగ నేపథ్యంలో విపరీతంగా పెరిగిపోవడంతో సామాన్యులు భగ్గుమంటున్నారు.

అప్పులు చేయాల్సిందే..!

కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం ఎత్తివేయడంతో ధరలకు మరింత రెక్కలు వచ్చాయి. దీంతో ప్రజలు పిండి వంటలు చేసుకోవాలంటే అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. వంట నూనె ధర రూ.123 నుంచి రూ.180 వరకు పలుకుతోంది ఒక్కసారిగా వంట నూనె ధరలు లీటర్‌పై రూ.30 నుంచి రూ.40 వరకు పెరిగింది. వెల్లుల్లి ధర రూ.400కు చేరింది. కందిపప్పు ధర రూ.135 నుంచి రూ.175 వరకు, ఎండుమిర్చి రూ.240, మినపప్పు రూ.135కి చేరాయి. దసరాకు నిత్యావసర వస్తువుల ధరలు, కూరగాయల ధరలు దిగివస్తాయని ఆశించిన సామాన్య, మధ్య తరగతి ప్రజలకు పాలకుల తీరు నిరాశ పరిచింది.

ఘుమఘుమలు దూరం

గ్రామీణ ప్రాంతాల్లో గత పది రోజుల నుంచే పండగ వాతావరణం నెలకొంది. పట్టణ ప్రాంతాల్లో నివసించే ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు సొంతూళ్లకు చేరుకోవడంతో, ప్రతి ఇంటా పిండి వంటల ఘుమఘుమలు వస్తుంటాయి. కానీ ధరలు పెరగడంతో ఈ ఏడాది ఆ పరిస్థితి కానరావడం లేదు. ముఖ్యంగా నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో గ్రామాల్లో పండగ సందడి లేకుండా పోయింది. పిల్లల కోసమైన దసరాకు పిండి వంటలు చేసుకుందామంటే ధరలు మండిపోతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండగ వేళ ప్రభుత్వాలు రేషన్ దుకాణాలు, రైతు బజార్ల ద్వారా ప్రజలకు ఉల్లిపాయలు, వంట నూనెలు, పప్పులు తక్కువ ధరకు విక్రయించాలని ప్రజలు కోరుతున్నారు. జూన్ ప్రారంభంలో మూడు కిలోల ఉల్లిపాయలు రూ.100 ఉండగా, ప్రస్తుతం రూ.180 పలుకుతోంది. ప్రతి ఇంట్లో నిత్యావసరమైన ఉల్లి ధరను నియంత్రించకపోవడంతో కొనుగోలుదారులకు కంటతడి తప్పడం లేదు. ఇదే సాకుతో కొందరు వ్యాపారులు కృత్రిమ కొరతను సృష్టించి మరీ ధరలు పెంచేస్తున్నారు.

వ్యాపారుల గగ్గోలు

కూరగాయల ధరలు విపరీతంగా పెరగడంతో.. ప్రతి రోజు లాభం కన్నా నష్టాలను చవిచూడాల్సి వస్తోందని చిన్న వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. పనుల్లేక ఇబ్బందులు పడుతున్న రోజువారీ కూలీలకు ఈ ధరలు మరింత షాక్ కొడుతున్నాయి. వారానికి అవసరమైన కూరగాయలు కొనుగోలు చేయాలంటే రూ.వెయ్యి వెచ్చించాల్సిందే. మునుపెన్నడూ లేనివిధంగా కూరగాయల ధరలు పెరగడంతో ప్రజానీకం ఆందోళన చెందుతున్నారు. స్థానికంగా పండించిన కూరగాయలు సైతం రేట్లు ఆకాశాన్నంటుతున్నాయి. ధరలను అదుపు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ప్రజలు విమర్శిస్తున్నారు.

ధరలను నియంత్రించాలి



పనుల్లేక జనం ఇబ్బందులు పడుతున్నారు. కూలీల చేతిలో చిల్లిగవ్వలేని పరిస్థితి ఏర్పడింది. మరోవైపు రోజురోజుకూ పెరిగిపోతున్న కూరగాయలు, నిత్యావసర ధరలతో సామాన్య ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సామాన్యులకు అందుబాటులో ఉండేలా ధరలను ప్రభుత్వం అదుపులోకి తేవాలి.

– వరసాల జాన్‌ప్రభాకర్, జిల్లా ఎస్సీ సంక్షేమ సంఘం, కొవ్వాడ

వ్యాపారంలో నష్టం



కూరగాయల ధరలు బాగా పెరిగాయి. వాతావరణ పరిస్థితుల వల్ల కూరగాయల పంటలు దెబ్బతినాయి. దీంతో మార్కెట్‌కు వచ్చే సరకు తగ్గడంతో రేట్లు పెరిగాయి. ఈ రేట్లతో కూరగాయలు అమ్మడం కష్టంగా మారింది. రోజూ కూరగాయలు కొనుగోలు చేసి, మార్కెట్‌కు తెచ్చి అమ్ముకున్న వాటిలో కొంత నష్టం వాటిల్లుతోంది.

– పి.సత్తిబాబు, వ్యాపారి, కాకినాడ

రక్తదానాన్ని సామాజిక బాధ్యతగా గుర్తించాలి



రక్తదానం చేస్తున్న డాక్టర్ బాదం బాలకృష్ణ

బాలాజీచెరువు: ప్రతి ఒక్కరూ రక్తదానాన్ని సామాజిక బాధ్యతగా గుర్తించాలని లయన్స్ క్లబ్ జిల్లా పూర్వ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ అన్నారు. లయన్స్ క్లబ్ కాకినాడ ఆధ్వర్యంలో శుక్రవారం రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో ఆయన జన్మదినం సందర్భంగా 88వ సారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణతో పాటు, మరో 80 మంది సభ్యులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కాకినాడ గవర్నర్ చిట్నీడి శ్రీనివాస్, క్లబ్ కార్యదర్శి పీవీఎస్ కుమార్, నేరళ్ల కుమార్, మధురవాణి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

50 వసంతాల పీడీఎస్‌యూ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కాకినాడ సిటీ: పీడీఎస్‌యూ ఆవిర్భవించి ఐదు దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా 50 వసంతాల పోస్టర్లను శుక్రవారం స్థానిక ఆనంద నిలయం హాస్టల్‌లో వివిధ జిల్లాల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దూ మాట్లాడుతూ, 1974 అక్టోబర్‌లో ఏర్పడిన పీడీఎస్‌యూ 50 ఏళ్లు పూర్తి చేసుకుంటోందన్నారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా విప్లవ విద్యార్థి ఉద్యమాల స్ఫూర్తిని గుర్తు చేసుకుంటూ, భవిష్యత్తు ఉద్యమ కర్తవ్యాలను రూపొందించుకునే లక్ష్యంతో సభలు, సమావేశాలు నిర్వహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. శాస్త్రీయ విద్య లక్ష్యంగా విద్యార్థుల హక్కుల కోసం రాజీలేని పోరాటాలను పీడీఎస్‌యూ నిర్వహించిందన్నారు. దోపిడీ, పీడనలేని సమాజం కోసం విముక్తి పోరాటాల్లో ప్రగతిశీల విద్యార్థులు ఉద్యమాల వైపు అడుగులు వేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆనంద నిలయం వార్డెన్ వి.లోవరాజు, వివిధ సంఘాల నాయకులు నాగాబత్తుల శ్రీనివాస్, వీరేంద్ర, ప్రసాద్, ఈశ్వర్, కిషోర్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన




ఆకట్టుకున్న కాళికా నృత్యం

బోట్‌క్లబ్: దసరా ఉత్సవాల సందర్భంగా స్థానిక బాలాత్రిపుర సుందరి ఆలయంలో శుక్రవారం రాత్రి బాలాత్రిపుర సుందరి కూచిపూడి డాన్స్ అకాడమీ నాట్యాచార్య బేతా సత్యనారాయణ శిష్యులు ప్రదర్శించిన నాట్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. 48 మంది శిష్య బృందం కూచిపూడి నృత్యం అలరించింది. తొలుత గణేశ స్తుతితో ప్రారంభించి, బ్రహ్మాంజలి, దుర్గాస్తుతి అన్నమాచార్య కీర్తనలు, త్యాగరాజ కృతులకు చిన్నారులు అద్భుతంగా నృత్యం చేశారు. కాళికా స్తుతి, జానపద నృత్యం, అమ్మోరు పాటలకు చేసిన నృత్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. గత 38 ఏళ్లుగా నాట్య ప్రదర్శన ఇస్తున్న బేత సత్యనారాయణను ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంథి బాబ్జి, ఈఓ వీర్రాజుచౌదరి సత్కరించారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



మహిషాసురమర్దిని అలంకరణలో సూర్యారావుపేట బాలాత్రిపుర సుందరి



దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారు



భానులింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు



కాళికాదేవి అలంకరణలో మాధవ్‌నగర్ కనకదుర్గ అమ్మవారు



కరప శివాలయంలో పర్వతవర్ధినీదేవి



కరపలో దుర్గాదేవి

బోట్‌క్లబ్: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా మహర్నవమి సందర్భంగా శుక్రవారం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అమ్మవారు వివిధ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. స్థానిక బాలాత్రిపుర సుందరి ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శ్రీవారి సేన ఆధ్వర్యంలో అన్నమాచార్యుల కీర్తనలు, శ్రీనివాసా అన్నమాచార్య భజన, నృత్య సేవా సంఘం ఆధ్వర్యంలో కోలాటం, శ్రీలలితా నృత్య నికేతన్ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. స్థానిక దేవాలయం వీధిలో ఉన్న బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారి ఆలయంలో నవావర్ణార్చన , కుంకుమ పూజ నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. స్థానిక భానుగుడి భానులింగేశ్వర స్వామి ఆలయంలో ఉషారాజరాజేశ్వరి దేవి అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక మాధవనగర్‌లోని కనకదుర్గ ఆలయంలో అమ్మవారు కాళికాదేవి అలంకరణలో పూజలందుకున్నారు. అమ్మవారికి నిర్వహించిన కుంకుమ పూజల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఆలయ కమిటీ కార్యదర్శి ఎస్వీ సాయిబాబా ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. స్థానిక రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయంలో అమ్మవారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంమార్చనలు చేశారు. స్థానిక అశోక్‌నగర సాయిబాబా ఆలయంలో అమ్మవారు మషిషాసురమర్దిని అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారిని మారేడుదళాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ వేదుల అచ్యుతరామారావు పాల్గొన్నారు.

అంతా అమ్మమయం



వాకలపూడిలోని సంతోష్‌నగర్‌లో రూ.50 నోట్ల అలంకరణతో కనకదుర్గ అమ్మవారు

కాకినాడ రూరల్: చెడుపై మంచికి చిహ్నంగా ఆదిపరాశక్తి అమ్మలగన్నమ్మ కనక దుర్గమ్మను వివిధ రూపాలలో దేవీ శరన్నవరాత్రుల్లో పూజించిన భక్తులు.. విజయ దశమిని ఘనంగా జరుపుకొనేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. అంతటా అమ్మమయంగా ఉత్సవాలు సందడి చేస్తున్నాయి. శనివారంతో విజయ దశమి వేడుకలు ముగియనున్నాయి. అమ్మవారి ఆశీస్సుల కోసం తొమ్మిది రోజుల పాటు కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నవరాత్రుల్లో భాగంగా తొమ్మిదో రోజు శుక్రవారం రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలో కనకదుర్గ అమ్మవారికి కుంభం నివేదించారు. వాకలపూడి సంతోష్‌నగర్‌లోని కనకదుర్గ అమ్మవారిని రూ.50 కరెన్సీ నోట్లలో అలంకరించారు. రమణయ్యపేట ఈశ్వర్‌నగర్‌ను ఆనుకుని రెల్లిపేటలో అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేసి, విద్యుద్దీపాలంకరణ నడుమ ఘనంగా పూజలు నిర్వహించారు.

భక్తి,శ్రద్ధలతో మహర్నవమి పూజలు

కరప: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా మహర్నవమి సందర్భంగా తొమ్మిదో రోజు శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న దుర్గాదేవి ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కరప, వలసపాకల, పాతర్లగడ్డ, వేములవాడ, పెద్దాపురప్పాడు, యండమూరు, వాకాడ, కూరాడ, విజయరాయుడుపాలెం నడకుదురు, పెనుగుదురు, జెడ్.భావారం, అరట్లకట్ట, కొరుపల్లి, వేళంగి, గొర్రిపూడి తదితర గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో, , అమ్మవారికి కుంకుమార్చన చేశారు. కరప దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, అర్చకులు కొంపెల్ల చక్రధర్ పూజలు చేశారు. వేకువజాము నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు మేడిశెట్టి పెద్దకాపు, నక్కా సత్యనారాయణ, మేడిశెట్టి అప్పలస్వామి భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. కరపలోని విష్ణ్వాలయంలో ప్రధానార్చకుడు పెద్దింటి అనంతాచార్యులు, శివాలయంలో పర్వత వర్ధినీదేవిని మహిరాసురమర్దిని అవతారంలో అలంకరించారు. గొర్రిపూడి పెదరావిచెట్టు సెంటర్‌లో ఉన్న దుర్గాదేవి ఆలయంలో కొలువై ఉన్న అమ్మవారికి పరిసర గ్రామాల భక్తులు పూజలు చేశారు. కరప మార్కెట్ యార్డు వద్ద విజయదుర్గా ఆటో యూనియన్ నిలిపిన దుర్గాదేవికి అర్చకులు కొక్కిరిగడ్డ సుబ్రహ్మణ్యం పూజలు చేశారు. ఆలయ కమిటీ వారు భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కూరాడలోని దీపాలచెట్టు సెంటర్‌లో ఉన్న దుర్గాదేవి గుడి వద్ద పూజాదికాలు నిర్వహించారు. పెనుగుదురు సంతోషిమాత ఆలయంలో అర్చకుడు కాదా సత్యనారాయణ ప్రత్యేక పూజలు చేశారు. పెనుగుదురు, నడకుదురు, వలసపాకల, కొరుపల్లి గ్రామాల్లో భవానీలు దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అరట్లకట్ట శివాలయంలో భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్లకు విశేష ;పూజలు నిర్వహించారు.